ఆసరా.. వెలుగులు

- తూర్పులో అట్టహాసంగా ఆసరా చెక్కుల పంపిణీ
- 4వ విడత నిధుల విడుదలతో మహిళలు ఆనందోత్సాహం
- 2,760 సంఘాలకు రూ.15.38 కోట్లు అందజేత
- వచ్చే ఎన్నికల్లో తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి: ఎంపీ ఎంవీవీ


లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి

ఎంవీపీకాలనీ: తూర్పు నియోజకవర్గంలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 4వ విడత ఆసరా నిధులు విడుదల చేయడంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆనందోత్సాహం వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు.. అనంతరం నియోజకవర్గంలోని 2,760 స్వయం సహాయక సంఘాలకు చెందిన 28,103 మంది మహిళా సభ్యులకు రూ.15,38,33,118 నిధులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని పేదల ప్రభుత్వానికి, చంద్రబాబు నేతృత్వంలోని పెత్తందారులకు మధ్య ప్రస్తుతం యుద్ధం జరుగుతోందన్నారు. పేదలు బాగుండాలి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం, ఇంగ్లిష్ మీడియంతో వారి పిల్లలు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్ సర్కారు ముందుకు సాగుతోందన్నారు. దీన్ని అడ్డుకొని రాష్ట్రంలో పెత్తందారుల పాలన తీసుకురావాలని చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దీన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన రాష్ట్ర ప్రజలంతా నిలవాలన్నారు. పేదలు బాగుంటే టీడీపీ ఓర్వలేదనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. గతంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, చంద్రబాబు తన పార్టీకి అనుకూలంగా ఉన్న వారికే సంక్షేమ పథకాలు ఇచ్చిన విషయాన్ని ప్రజలు మర్చిపోవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని ఎంపీ ఎంవీవీ పిలుపునిచ్చారు. ఇందుకు నియోజకవర్గంలోని మహిళలు సైనికుల్లా పని చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన పరిష్కరించడానికి ముందుంటానని మహిళలకు ఎంపీ ఎంవీవీ హామీ ఇచ్చారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు మహిళలను, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రంజక పాలనను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గోపాలపురం పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు, తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, పార్టీ మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, బోని శివరామకృష్ణ, శివగణేష్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, ఏపీడీవో దుర్గాప్రసాద్, తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సభకు హాజరైన ఆసరా లబ్ధిదారులు



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని

ఇది పేదల ప్రభుత్వం..



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పేదల ప్రభుత్వం. పేదలను అన్ని విధాలా ఆదుకుంటుంది. మాది 17వ వార్డులోని శ్రీవర్ష గ్రూప్. మాకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇంటికొచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ఇప్పుడు 4వ విడత ఆసరా నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు మహిళల అభ్యున్నతికి ఉపయోగపడతాయి.

– ఎస్.పార్వతి, లబ్ధిదారు, 17వ వార్డు

ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం..



ఆసరా నిధులతో మహిళలకు పెద్ద ఎత్తున మంచి జరుగుతోంది. కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టుకునేందుకు ఈ నిధులను పెట్టుబడిగా పెట్టుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నాం. మాది 28వ వార్డులోని పితాని దిబ్బ. మాకు 4వ విడత ఆసరాగా రూ.3.90 లక్షలు మంజూరైంది. ఈ నిధులు మా గ్రూప్ మహిళల వెల్ఫేర్‌కు ఉపయుక్తంగా నిలవనున్నాయి.

– కె.భవానీ, పితానిదిబ్బ, 28వ వార్డు

ఇబ్బందులను అధిగమించాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా నిధులతో అనేక రకాలుగా లబ్ధి పొందుతున్నాం. గతంలో ఉండే ఆర్థిక ఇబ్బందులను అధిగమించాం. మా గ్రూపునకు 4వ విడతగా రూ.4 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మహిళలంతా కలిసి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– జి.హేమలత, మద్దిలపాలెం, 23వ వార్డు

జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి..



వైఎస్సార్ ఆసరాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ, చేయూత, చేదోడు వంటి పథకాలు మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకునేందుకు అండగా నిలుస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికీ లబ్ధి జరుగుతోంది. దీంతో కాయగూరలు, పండ్లు విక్రయాలు ఇలా అనేక వ్యాపారాలు మహిళలు చేసుకుంటున్నారు. ఇంట్లో ఉండి టైలరింగ్, పాన్, దుస్తుల షాపులు నిర్వహిస్తూ ఆర్థిక భరోసా పొందుతున్నారు.

– సి.అనూష, లబ్ధిదారు

రూ.10.60 లక్షలు మంజూరయ్యాయి..



ఆసరా 4వ విడత ద్వారా మా గ్రూపునకు రూ.10.60 లక్షలు మంజూరయ్యాయి. దీంతో మాకు చాలా ఆర్థిక భరోసా లభించనుంది. అంతేకాకుండా మా గ్రూపులో చాలా మంది మహిళలు అమ్మఒడి, చేయూత, చేదోడు పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఆయా పథకాలను వినియోగించుకుని మా కుటుంబాల అభ్యున్నతికి బాటలు వేసుకుంటున్నాం. ఇందుకు సీఎం జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఎ.శాంతి, లబ్ధిదారు

క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట, వాసవానిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో పలువురు మృతి చెందారు. ఈ మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పిల్లా సుబ్బారావు(75), కె.అప్పారావు (51), రావోలు నాగమ్మ(65), కోట వీధి ఎర్రోడు(62), తెడ్డు గున్నయ్య(60) కుటుంబ సభ్యులకు సాయం అందించడంతో పాటు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బైకుల చోరీలపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎంవీపీ కాలనీ: ద్విచక్ర వాహనాల చోరీలపై అప్రమత్తత అవసరమని ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ద్విచక్ర వాహనాల దొంగతనాలపై ద్వారకా జోన్ క్రైం పోలీసులు నగరవాసులకు అవగాహన కల్పించారు. ఎంవీపీ కాలనీతో పాటు జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ కూడళ్లలో ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలను భద్రంగా ఉంచుకోవడంలో మెలకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా ద్వారకా క్రైమ్ సీఐ శ్రీనివాస్, ఎంవీపీ క్రైమ్ ఎస్ఐ రాందాస్‌లు బైక్ సెంటర్ లాకింగ్ సిస్టమ్ మార్చడం, పెట్రో లాకింగ్, వీల్ లాక్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ఏయూ ఆచార్యుడికి రెండు పేటెంట్‌లు


ఈశ్వర్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్‌కు రెండు భారతీయ పేటెంట్‌లు లభించాయి. తిరుపతి నుంచి విశాఖపట్నం మధ్యలో ఉన్న తూర్పు కనుమల్లోని ఔషధ మొక్కలపై చేసిన పరిశోధనకు ఈశ్వరకుమార్‌కు, పరిశోధకులకు ఈ పేటెంట్‌లు దక్కాయి. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందిచారు. ఏయూ ఐపీఆర్ కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 పేటెంట్ దరఖాస్తులు చేశామని, ఇప్పటి వరకు 6 పేటెంట్‌లు సాధించామన్నారు.

ఐఎన్ఎస్ దేగాలో సీ క్యాడెట్ కార్ప్స్


ఛేతక్ హెలికాప్టర్ గురించి వివరిస్తున్న ఐఎన్ఎస్‌దేగా అధికారి

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో 30 మంది సీ క్యాడెట్ కార్ప్స్ సందర్శించారు. ఇక్కడి పలు విభాగాల పని తీరును పరిశీలించారు. చేతక్ హెలికాప్టర్ ఏవిధంగా పని చేస్తుంది. ఏవియేషన్‌లో నిర్వహించే విధులను వీరికి వివరించారు. ఇక్కడి సాహసోపేతమైన, నైపుణ్యాలు, సృజనాత్మకత ఆవిష్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్‌డేగా అధికారులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అభివృద్ధి ఫలాలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన డబుల్ రోడ్డు, వంతెన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో రూ.కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే వీధుల్లో సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, గెడ్డల ఆధునికీకరణ, తదితర పనులు పూర్తయి ప్రజలకు వినియోగంలోకి వచ్చాయి. ప్రస్తుతం మరో రెండు అభివృద్ధి ఫలాలు జీవీఎంసీ అధికారులు మంగళవారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. వార్డు పరిధి బీఆర్‌టీఎస్‌లో చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు సుమారు 400 మీటర్లు పొడవున నిర్మించిన డబుల్ రోడ్డు, సూర్యతేజానగర్, పార్వతీనగర్ మధ్య పెద్ద గెడ్డపై నిర్మించిన వంతెన ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక్కడ రోడ్డు, బ్రిడ్జి విస్తరణ చేసి కొత్తగా నిర్మించడంతో కొన్నేళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లయిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ 2.35 కోట్లతో డబుల్ రోడ్డు

చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు సుమారు 400 మీటర్ల పొడవున 20 అడుగుల ఇరుకు రోడ్డు ఉండేది. దీన్ని 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.35 కోట్లతో 60 నుంచి 80 అడుగులకు విస్తరించి డబుల్ రోడ్డు నిర్మించారు. రెండు వైపులా ఫుట్‌పాత్, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం వినియోగంలోకి తీసుకురానున్నారు.

రూ.3 కోట్లతో వంతెన

వార్డులో సూర్యతేజానగర్, పార్వతీనగర్ మధ్య పెద్ద గెడ్డపై 20 అడుగుల వెడల్పుతో ఇరుకుగా ఉన్న చిన్న బ్రిడ్జిని తొలగించారు. రూ.3 కోట్లు జీవీఎంసీ నిధులతో ఆ వంతెనతో పాటు దానికి ఎదురుగా మరో చిన్న బ్రిడ్జిని నిర్మించారు. వాటిని కూడా మంగళవారం ప్రారంభించనున్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు


బంగ్లా నుంచి కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి కాలుష్య రహితమైన బ్యాటరీ కారులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించి విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్


వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారులు

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె.ఏపీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షలు వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లోని సౌకర్యాలు, మందుల నిల్వలు, సంచార వైద్య వాహనాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికి సిబ్బందితో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని సిబ్బంది, డిఫెన్స్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఉమాపతి, కోరాడ రాజబాబు, వైద్యురాలు షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, డీపీఎంఓ జె.భీమేశ్వరరావు, సిహెచ్ఓ గంటా సూర్యకళ పాల్గొన్నారు.

29లోగా కార్మిక శాఖ నుంచి లైసెన్స్ పొందాలి

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ సర్కిల్–2 బుద్ధా మునిస్వామి పేర్కొన్నారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతరరాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం ప్రకారం విధిగా ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రాజమహేంద్రవరంలో 11న దళిత సింహగర్జన

దాబాగార్డెన్స్: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 25 పథకాలు పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని దళితులను చైతన్యవంతుల్ని చేయడానికి ఈ నెల 11న రాజమహేంద్రవరంలో దళిత సింహగర్జన నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు సంబంధించి 25 పథకాలను ప్రభుత్వం తీసేసిందని ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణం ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేస్తానని తెలిపారు. సమావేశంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి పెంటారావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్‌ప్లాంట్ ఎల్‌అండ్‌డీసీ మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సాత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది. పర్వార్ సస్పెన్షన్‌పై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హర్షం ప్రకటించారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతుల ప్రదానం


ట్రోఫీలను ప్రదానం చేస్తున్న అధికారులు

ఏయూక్యాంపస్: యువతను ప్రోత్సహించాలనే మంచి సంకల్పంతో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఏయూ జిమ్నాజియం మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అప్పల రాజు, కార్యదర్శి నాగేశ్వరరావు, ఇంటర్నేషనల్ అథ్లెట్ సీహెచ్ ప్రతాప్ కుమార్, జి.సత్యారెడ్డి, శ్రీనివాస రెడ్డి, జగదీష్ రెడ్డి, వెంకట నరేష్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మధుసూధన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యా సమాచారమ్

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏయూ జాతీయ సేవా పథకం తరఫున పాల్గొన్న వలంటీర్లను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎస్.కల్యాణి(ఎంఆర్ కళాశాల), కె.కేదార్శ్రీ(సెయింట్ జోసెఫ్ కళాశాల) విద్యార్థినులు జనవరి 1 నుంచి 31వ వరకు న్యూఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్నారు. దేశ ప్రధాని, రాష్ట్రపతి ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని మన రాష్ట్ర సంస్కృతులు, నృత్యాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. అదే విధంగా జనవరి 26న జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లోనూ పాల్గొని ప్రతిభకనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో కల్యాణికి డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని కుంచాల కల్యాణికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎం.జి.మునిరెడ్డి పర్యవేక్షణలో స్థిరమైన పట్టణ నీటి నిర్వహణ, అంచనా–ఏకీకరణ అంశంపై జరిపిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి సోమవారం కల్యాణి డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. స్మార్ట్ సిటీ విశాఖ కోసం స్థిరమైన నీటి నిర్వహణ వ్యవస్థను సూచించడానికి ఈ పరిశోధన దోహదపడనుంది.

నైపుణ్యం పెంపుపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఆంధ్రా బయో సమ్మిట్ ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యం పెంపు దృష్టి పెట్టాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ, టీ కాబ్స్–ఈ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి జీవ సదస్సు(ది ఆంధ్రా బయో సమ్మిట్)ను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను విశ్వవనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్య ప్రత్యేకతను చాటాలన్నారు. ప్రయోగాత్మక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మీ, చైర్ ప్రొఫెసర్ పి.ఎస్.పి.ధనుంజయ్, ఆచార్య పద్దయ్య, టి.క్యాబ్స్–ఈ వ్యవస్థాపకుడు డాక్టర్ రవి, ఆచార్య సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ సమన్వయకర్తగా గిరిజాశంకర్


గిరిజాశంకర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) సమన్వయకర్తగా ఫార్మసీ కళాశాల ఆచార్యులు జి.గిరిజాశంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి ఆయన ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య గిరిజాశంకర్‌ను వీసీ అభినందించారు.